News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :219 | ఖమ్మం | ఆదివారం, సెప్టెంబర్ 13, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## దిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన బ్రిక్స్ సదస్సు

బ్రిక్స్ దిల్లీ డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ
విభేదాలు పక్కనపెట్టి దిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం తెలిపిన అరబ్ దేశాలు
భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు
డాలర్‌కు బదులుగా సొంత కరెన్సీలతో వాణిజ్యం

# బ్రిక్స్ కూటమి ఏ దేశానికి వ్యతిరేకం కాదు



- దిల్లీలో ప్రారంభమైన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- అతిథులు అందరికీ స్వాగతం పలికిన ప్రధాని మోదీ
- భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత అనేది ప్రజల కేంద్రంగా, మానవత్వమే మొదటి ప్రాధాన్యత అనే విధానంపై ఆధారపడి ఉంది
- స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత మా ప్రాధాన్యతలు
- వీటితోపాటు బ్రిక్స్ సహకారాన్ని సామాన్య ప్రజలతో అనుసంధానించడంపై మేము ప్రత్యేకంగా దృష్టి సారించాం

# పన్నుపై అపోహలొద్దు



- 20 శాతాన్ని సీఎం ఆమోదం మేరకు 10 శాతానికి తగ్గిస్తున్నాం
- 'క్యూర్'లో ఆస్తి పన్నుల పెంపుపై స్పష్టతనిచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు
- ఈ మేరకు బిల్లుకు సవరణ ప్రతిపాదించిన స్పీకర్.. ఆమోదించిన అసెంబ్లీ
- అపెక్స్ కౌన్సిల్‌కు మేయర్లనూ ఆహ్వానించాలని కోరిన బీజేపీ, ఎంఐఎం

హైదరాబాద్

కోర్ అర్బన్ రీజియన్‌లో పన్నులపై అపోహలు వద్దని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు. ప్రతి ఏటా 20 శాతం ఆస్తి పన్నులు పెరుగుతాయనే విషయం వాస్తవం కాదన్నారు. పన్నులు ఎలా అంటే అలా పెంచడానికి వీల్లేదని, ప్రస్తుతం అమల్లో ఉన్న కంప్యూటేషన్ పద్ధతి ప్రకారమే పన్నులు పెరుగుతాయని, గరిష్టంగా 10 శాతానికి మించి పెరగవన్నారు. అది కూడా కేవలం 0.15 శాతం నివాస, 0.75 శాతం వాణిజ్య సముదాయాల మీద మాత్రమే పడుతుందని వివరించారు. శనివారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరపున కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) బిల్లు--2026 (క్యూర్)ను ప్రవేశపెట్టిన శ్రీధర్‌బాబు చట్టం లక్ష్యాలను వివరించారు. క్యూర్ పరిధిలోని - మిగతా3లో



## బ్రిక్స్‌లో భారత్ దౌత్య బలం చూపించాలి

- మోదీ సర్కార్‌కు కాంగ్రెస్ కీలక సూచనలు
- గ్లోబల్ సౌత్‌లో భారత్‌పై నమ్మకం పెంచాలన్న కాంగ్రెస్ ఇరాన్ విషయంలో ఉన్న అనుమానాలకు సమాధానం ఇవ్వాలన్న హస్తం పార్టీ
- సమ్మిట్ వివరాలపై మోదీ ప్రెస్‌మీట్ పెట్టాలని డిమాండ్
- ఇరాన్ విషయంలో స్పష్టత ఇవ్వాల్సిందే!
- యుద్ధం నేపథ్యంలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య విభేదాలు కనిపిస్తున్నాయి

# అన్ని సౌకర్యాలు అందిస్తాం

## భక్తితో గణనాథుడిని పూజిద్దాం

- గణేశ్ మండప నిర్వాహకులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- అసెంబ్లీ ఆవరణలోని శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- ఈ రివ్యూకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హాజరు.
- గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలి
- శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలి
- ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలి
- హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయి



హైదరాబాద్

గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ పలు కీలక సూచనలు చేశారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలని - మిగతా3లో

# మేం కొత్తగా పెట్టిందేమీ లేదు

- అయితే ఉండకూడనివి కూడా 22ఏ జాబితాలో పడ్డాయి
- అప్‌డేట్ కాని ధరణి కాపీనే మళ్లీ అప్‌లోడ్ చేయడంతోనే సమస్యలు
- తప్పు జరిగిన మాట వాస్తవం... కానీ సరిదిద్దుతున్నాం
- దొంగే పోలీస్‌ను దొంగా దొంగా అన్నట్టు బీఆర్ఎస్ వైఖరి
- ప్రజల ఆస్తులపై హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తాం
- ఏడాదిన్నరలోపే భూముల సర్వే చేస్తాం
- ధరణి ఫోరెన్సిక్ ఆడిటింగ్‌లో భయంకర విషయాలు తేలాయి... అన్నీ 'సెట్'కు పంపాం



హైదరాబాద్

'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత 22ఏ జాబితాలో పెట్టిన భూములేవీ లేవు. మేం అధికారంలోకి వచ్చాక ఈ జాబితాను కొత్తగా తయారు చేయలేదు. 1999లో ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌ను రిజిస్ట్రేషన్ చేసినప్పుడు ఈ జాబితా అవసరం వచ్చింది. అప్పటి నుంచి కొనసాగుతోంది. 2009లో కోర్టు ఆదేశానుసారం ఈ జాబితా తయారు చేశారు. 2009--15 వరకు ఈ జాబితాపై హైకోర్టులో రెండువేల కేసులు పడ్డాయి. ఆ సమయంలో ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. 22ఏ జాబితా భూములను ఐదు కేటగిరీల్లో వర్గీకరించాలని చెప్పింది. కానీ, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పని చేయలేదు. ఈ



## ఎన్నికల ప్రక్రియకు పునాది ఓటర్ల జాబితానే


- ప్రపంచంలోనే అత్యంత పారదర్శక ఎన్నికల వ్యవస్థల్లో భారత్‌ది ఒకటి
- భారత ఎన్నికల ప్రక్రియపై సీఈసీ కీలక వ్యాఖ్యలు
- రాజకీయ పార్టీలు, అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు నిరంతరం పరిశీలనలో భాగస్వాములవుతున్నారు
- యువత ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపు
- 18 ఏళ్లు పూర్తి చేసుకున్న అర్హత కలిగిన ప్రతి భారతీయ పౌరుడి పేరు

# ఎప్పటిలోగా తొలగిస్తారో చెప్పాలి

- 22ఏ భూముల నుంచి ప్రజలకు ఎప్పుడు విముక్తి కల్పిస్తారు:హరీశ్‌రావు
- తప్పు జరిగిందని ఒప్పుకున్నారు.. క్షమాపణ చెప్పి గడువు ప్రకటించాలి
- తన కుటుంబంపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని నిలదీత
- 29 ఎకరాలు నావని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా: ఎమ్మెల్యే పల్లా

హైదరాబాద్

రాష్ట్రంలో అత్యంత ప్రధానమైన 22ఏ నిషేధిత భూముల సమస్యకు ప్రభుత్వం తక్షణ పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆయన శనివారం రాత్రి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా బాధితులకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశపూర్వకంగా సస్పెండ్ చేసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అబద్ధాల ప్రవాహం పారించారని ఆరోపించారు. తాను అడిగిన ఏ ప్రశ్నకూ మంత్రి సమాధానం చెప్పలేదన్నారు.



# మేం కొత్తగా పెట్టిందేమీ లేదు

-మొదటిపేజీ తరువాయి

పబ్లిక్‌డొమైన్‌లో పెట్టాలని, కోర్టుకు కూడా కాపీ ఇవ్వాలని, అన్ని జిల్లాల్లో ఇవ్వాలని, 22ఏ జాబితా నుంచి భూములను తొలగించాలంటే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోర్టు సూచించింది. దీంతో కమిటీ ఏర్పాటు చేయడమే కాకుండా డిసెంబర్ 3, 2025న ఈ జాబితాను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాం. అయితే, తక్కువ సమయం ఉన్నందున జీవో 121, ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన సమయంలో ఏ భూములు ఈ జాబితాలో ఉన్నాయో వాటిని అప్‌డేట్ చేయకుండా అదే కాపీని అప్‌లోడ్ చేశాం. స్వార్థం, స్వలాభం కోసం చేసింది కాదు. తప్పు జరిగిన మాట వాస్తవం. దీనిపై నేను విచారం వ్యక్తం చేశాను. అయితే, యుద్ధ ప్రాతిపదికన సరిదిద్దుతున్నాం' అని రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. శనివారం అసెంబ్లీలో 22ఏ భూములపై స్వల్పకాలిక చర్చను పొంగులేటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మూడున్నర గంటల పాటు ప్రసంగించారు. చేయాల్సింది చేసి, కొల్లగొట్టాల్సింది కొల్లగొట్టి నంగనాచిల్లా మాట్లాడుతున్నారని, దొంగే పోలీసును దొంగా దొంగా అన్నట్టుగా బీఆర్‌ఎస్ వైఖరి ఉందని ధ్వజమెత్తారు.

**47,400 ఎకరాలు తగ్గింది**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యే నాటికి 220 జాబితాలో 1,02,52,690 ఎకరాల భూమి ఉంటే, 2026 ఆగస్టు 31 నాటికి 1,02,05,250 ఎకరాలు ఉందని చెప్పారు. అంటే 47,400 ఎకరాలు తగ్గిందని, ఇంకా తాము లక్షల ఎకరాలు కొత్తగా ఈ జాబితాలో చేర్చింది ఎక్కడని నిలదీశారు. రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి 1,95,812 ఎకరాల వ్యవసాయేతర భూములు 22ఏ జాబితాలో ఉంటే ఇప్పుడు 1,94,543 ఎకరాలున్నాయని, దాదాపు 800 ఎకరాలు తగ్గితే తాము కొత్తగా ఏం చేరుస్తామని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి తొలగించిన ప్రతి అంగుళం భూమికి కాగితాలున్నాయని, టీఎం--15 మాడ్యూల్ ద్వారా ప్రజల పట్టా భూములైన 23వేల ఎకరాలను వారికి ఇచ్చేశామని, జీవోలు, మెమోల లద్వారా మరో 20వేల ఎకరాలు ప్రజలకే ఇచ్చామన్నారు. అయితే, బీఆర్‌ఎస్ హయాంలో ఈ జాబితా నుంచి తొలగించిన 23వేల ఎకరాల భూమికి కాగితాల్లేవని కమిటీ చెప్పిందన్నారు. 22ఏ జాబితా కారణంగా రిజిస్ట్రేషన్లు తగ్గాయని అనడంలో వాస్తవం లేదన్నారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనని, ఇక్కడ పలికే చిలుకలు మాత్రమే వేరని, కానీ పలుకులు మాత్రం ఒకటేనన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు, ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు ఒకే తరహాలో మాట్లాడిన మాటలను స్పీకర్ అనుమతితో సభకు వీడియో ద్వారా వినిపించారు.

**శకుని మామ చేసి ఉంటే..**

'అగ్గిపెట్టెల అబద్ధాల రావు, శకుని మామ తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్నారు. అప్పుడే వారు ఈ జాబితాను సరిచేసి ఉంటే ఇప్పుడు సమస్య వచ్చేది కాదు. వారు తెచ్చిన ధరణి కారణంగా ఎంతో మంది ఆత్మహత్యల పాలయ్యారు. ఇప్పుడేదో మాట్లాడుతున్నారు. మనిషి రక్తం మరిగిన పులి మళ్లీ మళ్లీ తిరిగినట్టు అధికారం కోసం దోచుకోవడం కోసం నోరు తెరిస్తే అబద్ధాలాడుతున్నారు. కానీ ఆ పులికి తెలియదు.. వచ్చి రేవంత్‌రెడ్డి అనే బోనులో పడతాడని. ముక్కుతాడు వేసి కట్టేస్తాడని తెలియదు. నిద్ర పట్టని రాత్రులు గడుపుతూ రోడ్డెక్కి ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. 22ఏ జాబితాతో రాష్ట్రం అతలాకుతలమవుతున్నప్పుడు పిల్లకాకులు అరవడమెందుకు? ప్రధాన ప్రతిపక్ష నేత వచ్చి మాట్లాడొచ్చు కదా? సలహాలు ఇవ్వచ్చు కదా? వసతులు, ఏర్పాట్లు కావాలి కానీ ప్రజలకు సమస్య వచ్చినప్పుడు కనుచూపు మేరలో కనిపించవా? నువ్వున్నప్పుడు నేను మాట్లాడాలనే కోరిక అలానే మిగిలిపోయేట్టుంది' అని పొంగులేటి చెప్పారు.

**మొహం చాటేయడం అలవాటే..**

22ఏ జాబితాలో ఉన్న భూములను చూపెట్టి పేదల కడుపుకొట్టారని, అందుకే సమాధానం చెప్పాల్సి వస్తుందని సభలో గందరగోళం సృష్టించి ప్లాన్ ప్రకారం పారిపోయారని పొంగులేటి అన్నారు. అయితే, చర్చకు మొహం చాటేయడం వారికి అలవాటేనని, సభ నుంచి వారు పారిపోయినా ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇప్పుడు 22ఏ జాబితా కారణంగా అక్కడక్కడా ప్రజలు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే అని, కానీ ధరణిని అమల్లోకి తెచ్చినప్పుడు మూడు నెలల పాటు అసలు రిజిస్ట్రేషన్లనే నిలిపివేశారని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి 387 గ్రామాలకు నక్షాల్లేవని, ఆయా గ్రామాల్లో సర్వే చేసి భూముల సమస్యలు తీరుస్తున్నామని చెప్పారు. ఇందుకోసం మొదటి దశలో భాగంగా 70 రోవర్లు కొనుగోలు చేశామని, 32 జిల్లాల్లోని 70 చొప్పున గ్రామాల్లో తొలిదశలో పైలట్ సర్వే చేస్తున్నామన్నారు. నవంబర్ చివరికల్లా ఈ సర్వే పూర్తవుతుందని అన్నారు.

**23వేల ఎకరాలు అక్రమంగా బదిలీ**

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని వారు చేసిన అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిటింగ్ నిర్వహిస్తే అనేక భయంకర విషయాలు వెలుగులోనికి వచ్చాయని పొంగులేటి చెప్పారు. పైలట్‌లో భాగంగా సిద్ధిపేట, సిరిసిల్లలో ఆడిట్ చేస్తే 23వేల ఎకరాల భూమిని 13వేల ఖాతాలకు బదిలీ చేసినట్టు తేలిందన్నారు. ఏ భూమి ఎవరి ఖాతాలోకి వెళ్లింది.. విదేశాల్లో జరిగిన లావాదేవీలేంటి? అక్కడ కట్టుకున్న హోటళ్ల వివరాలను ప్రత్యేక విచారణ బృందం (సెట్)కు పంపామని తెలిపారు. అధికారం పోయిన తర్వాత కూడా అధికారంలోనే ఉన్నామని భ్రమపడుతూ, పాత వ్యవస్థలను ఉపయోగించుకుని పేదల భూములను కొల్లగొట్టాలనే ఆలోచనలను మానుకోవాలని హితవు పలికారు. అసలు 22ఏ భూముల విషయంలో కొన్ని సమస్యలను గుర్తించామని, వాటిపై సభ సూచన మేరకు త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పొంగులేటి వెల్లడించారు. యూఎల్‌సీ భూములు, జీహెచ్‌ఎంసీతో పాటు హెచ్‌ఎండీఏ, డీటీసీపీలు అనుమతిలిచ్చిన లేఅవుట్లు, జీవో 59, జీవో 118, అసైన్డ్ భూముల్లో కట్టుకున్న ఇళ్లు, ఇందిరమ్మ హౌసింగ్ కింద కేటాయించిన ఇంటి స్థలాలు, నాలా మార్పిడి కాని భూములు, ప్రభుత్వ భూముల్లో అనధికారిక లేఅవుట్ల విషయంలో సమస్యలున్నాయని, వీటిని సభ నిర్ణయం మేరకు పరిష్కరించడానికి ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని పొంగులేటి స్పష్టం చేశారు.

**ధరణి దందాతో రూ.లక్షల కోట్లు కొల్లగొట్టారు...**

--ఎన్నికల్లో ఖర్చుకు వాడారు

--హరీశ్‌రావు సొంత మామకు ప్రభుత్వ భూమిని కట్టబెట్టించారు

--ఇలా పొందినవారిలో పల్లా రాజేశ్వరరెడ్డి, గంగుల కమలాకర్ ఉన్నారు

ధరణి పోర్టల్‌ను అట్టుపెట్టుకుని బీఆర్‌ఎస్ పెద్దలు రూ.లక్షల కోట్లు కొల్లగొట్టారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. అలా వచ్చిన డబ్బును గత ఎన్నికల్లో ఖర్చు కోసం వాడుకున్నారన్నారు. ఎకరాల కొద్దీ భూమిని నిషేధిత జాబితా నుంచి తప్పించి పట్టా భూములుగా మార్చి విక్రయించి భారీగా డబ్బు పోగు చేసుకున్నారన్నారు. అలాంటి లావాదేవీలకు సంబంధించి తమ ప్రభుత్వం గుర్తించిన భూములను తిరిగి నిషేధిత జాబితాలోకి చేరుస్తూ, అవి పేదలకు దక్కేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 22ఏకు సంబంధించి శాసనససభలో జరిగిన స్వల్పకాలిక చర్చను ప్రారంభిస్తూ ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీశ్‌రావులను ప్రధాన పాత్రధారులుగా పేర్కొంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను శకుని మామ అని, హరీశ్‌రావును అగ్గిపెట్టెల అబద్ధాల రావు, అని కేటీఆర్‌ను డ్రామాల వ్యక్తి అంటూ పదేపదే సంబోధించారు.

**ఉదాహరణలతో సభ ముందు...**

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని అసైన్‌మెంట్, భూదాన్ భూములను నిషేధిత జాబితా నుంచి తప్పించి పట్టా భూములుగా మార్చి ప్రైవేట్ పరం చేశారంటూ మచ్చుకు కొన్ని ఉదంతాలుగా సభ దృష్టికి తెచ్చారు. పొంగులేటి మాటల్లోనే... సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్ట గ్రామంలో సర్వే నెం.271లో 327.09 ఎకరాల ప్రభుత్వం భూమిని గతంలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పట్టాల కోసం కేటాయించింది. ఇందులో 6.18 ఎకరాల భూమిని గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న హరీశ్‌రావు తన సొంత మామ (భార్య తండ్రి) హన్మంతరావుకు కట్టబెట్టించారు. ఇందులో కొంత భూమికి సంబంధించి మిషన్ భగీరథ పరిహారం కూడా పొందారు.

మెదక్ జిల్లా శివంపేట మండలం సిక్లిందాపూర్ గ్రామంలో సర్వే నెం.33 నుంచి 87 వరకు ఉన్న 569.05 ప్రభుత్వ భూమిలో 2023 అక్టోబరు 5న 372.32 ఎకరాలకు సంబంధించి ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్ (ఓఆర్‌సీ) జారీ చేశారు. దాన్ని మొత్తంగా స్వాహా చేశారు. ఆ రూపంలో పోగుచేసుకున్న రూ.కోట్ల మొత్తాన్ని ఎన్నికల ఖర్చుగా వినియోగించారు.

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిప్పలతుర్తి గ్రామ సర్వే నం.58, 59లో ఉన్న 476.30 ఎకరాలు ప్రభుత్వం భూమిలో.... 112.21 ఎకరాల భూమిని 22ఏ జాబితా నుంచి తప్పించి ఓ కుటుంబంలోని సభ్యుల పేర్లతో ఓఆర్‌సీ జారీ చేశారు. ఇక్కడే 195.25 ఎకరాలను కూడా నిషేధిత జాబితా నుంచి తొలగించి పట్టాలు జారీ చేసే సమయంలో కొందరు పసిగట్టి ఏసీబీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆ బాగోతం వికటించి తిరిగి ఆ భూములు నిషేధిత జాబితాలోకి చేరాయి. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగుల పల్లి గ్రామంలో సర్వే నం. 186 నుంచి 189లో ఉన్న 29.27 ఎకరాల భూదాన్ భూమి ఉండగా, దాన్ని పట్టా భూమిగా కన్వర్ట్ చేయించారు. ఇందులో 24.27 ఎకరాలను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మరో ఇద్దరి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ భూమి ప్రస్తుత విలువ రూ.3 వేల కోట్ల వరకు ఉంటుంది. ఇప్పుడు దీన్ని మేము తిరిగి నిషేధిత జాబితాలో చేర్చాం.

? ఇదే గ్రామం శంకర్‌హిల్స్ ఏరియాలోని సర్వే నం. 111--191 లోని 460 ఎకరాల భూమికి పట్టాదారులు గతంలో ఓ ప్రైవేటు సంస్థకు జీపీఏ ఇచ్చారు. దాన్ని ఆ సంస్థ 3,333 ప్లాట్లుగా విడదీసి విక్రయిస్తోంది. మరోవైపు ఆ భూమిని మరో సంస్థకు మరోసారి జీపీఏ చేశారు. ఆ సంస్థ ఎకరాల రూపంలో విక్రయిస్తోంది. దీనిపై కొందరు కోర్టుకు వెళ్లగా స్టేటస్‌కో జారీ అయింది. 2022లో నాటి ప్రభుత్వం ఆ భూమిని నిషేధిత జాబితాలో పెట్టింది. తర్వాత 226.06 ఎకరాలను ఆ తర్వాత నిషేధిత జాబితా నుంచి తప్పించి ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారు. అలా పొందినవారిలో బీఆర్‌ఎస్ నేత గంగుల కమలాకర్ కూడా ఉన్నారు'

# పన్నుపై అపోహాలొద్దు

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాలు రాష్ట్ర ఆర్థిక ఉత్పత్తిలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయని వివరించారు. శనివారం మధ్యాహ్నం తర్వాత శ్రీధర్‌బాబు బిల్లుపై జరిగిన చర్చలో పలు పార్టీల సభ్యులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. బిల్లులో పెట్టిన 20 శాతాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం మేరకు 10 శాతానికి తగ్గిస్తున్నట్టు చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్డు వరకు విస్తరించిన హైదరాబాద్ నగరాన్ని పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి చైర్మన్‌గా ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, వరదల నివారణ, చెత్త నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో వివిధ సంస్థలు, శాఖల మధ్య సమన్వయం అవసరమన్నారు. భవిష్యత్‌లో నగర అవసరాలకు అనుగుణంగా ఈ వ్యవస్థ పనిచేసేలా క్యూర్ చట్టాన్ని రూపొందిస్తున్నట్లు వివరించారు. అనంతరం బిల్లు ఆమోదానికి ప్రతిపాదించిన సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఈ అంశాన్ని వివరించారు. పన్నుల పెరుగుదలను 20 నుంచి 10 శాతానికి తగ్గిస్తూ బిల్లులో సవరణ చేయాలని సీఎం చేసిన ప్రతిపాదనను సభ ముందు ఆమోదానికి పెట్టారు. ఈ సవరణతోపాటు క్యూర్ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది.

**ఎంఐఎం, బీజేపీ ఏకాభిప్రాయం**

పాల్వాయి హరీశ్‌బాబు (బీజేపీ) లేవనెత్తిన అంశాన్ని ప్రస్తావిస్తూ కోర్ రీజియన్‌లో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటు చేసే అపెక్స్ కౌన్సిల్ కేవలం విధాన నిర్ణయాల కోసమేనని, ఈ సమావేశాలకు అవసరమైతే మేయర్లను ఆహ్వానిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ కౌన్సిల్ ఏర్పాటు ద్వారా మేయర్లు, కార్పొరేటర్ల స్థానిక అధికారాలపై ఎలాంటి ప్రభావం ఉండబోదని వివరించారు. ఇందుకు విభేదించిన హరీశ్‌బాబు అపెక్స్ కౌన్సిల్‌కు మేయర్లను రమ్మనకపోతే వారికి ఇంకేం అధికారాలుంటాయని ప్రశ్నించారు. ఎంఐఎం సభ్యుడు జుల్ఫికర్ అలీ జోక్యం చేసుకుంటూ.. అపెక్స్ కౌన్సిల్ సమావేశాలకు మేయర్లను ఆహ్వానించాల్సిందేనని డిమాండ్ చేశారు. దీంతో పాల్వాయి హరీశ్‌బాబు బల్లలు చరిచి మరీ అభినందించారు. ఎంఐఎం సభ్యుడు కూడా అదే చెబుతున్నాడంటూ అధికార పక్షానికి చూపెట్టే ప్రయత్నం చేశారు. వెంటనే శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ... జుల్ఫికర్ అలీని హరీశ్‌బాబు గైడ్ చేస్తున్నారని, అందుకే ఆయన ఆ కోణంలో మాట్లాడుతున్నారని బదులిచ్చారు. మూడు కార్పొరేషన్లను నియంత్రించేందుకు అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయడం లేదని, ఈ కౌన్సిల్ విశాల దృక్పథంతో పనిచేస్తుందని వివరణ ఇచ్చారు.

**ప్రజలపై తీవ్ర భారం: అక్బరుద్దీన్**

క్యూర్ బిల్లులోని పలు అంశాలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని, బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. బిల్లు న్యాయస్థానాల్లో నిలవదని, సెలక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. క్యూర్ పరిధిలోని కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్ల అధికారాలకు కత్తెరేసి కీలక అధికారాలను క్యూర్ అపెక్స్ కౌన్సిల్‌కు, పురపాలక, పట్టణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి నేతృత్వంలోని క్యూర్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి అప్పజెప్పారని తప్పుబట్టారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు అధికారాలు అప్పజెప్పకపోతే ఎన్నికలు నిర్వహించి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వార్షిక అద్దె విలువకి బదులుగా ప్రభుత్వం నిర్ణయించే మార్కెట్ విలువ ఆధారంగా ఆస్తి పన్నులను విధించాలని బిల్లులో పొందుపర్చడం పట్ల అభ్యంతరం తెలిపారు. స్థలం, భవనం మార్కెట్ విలువలను కలిపి ఆస్తి పన్నులు విధిస్తే నగర ప్రజలపై తీవ్ర భారం పడుతుందని తప్పుబట్టారు. ఏటా 20 శాతం ఆస్తి పన్నులు పెంచాలని బిల్లులో ప్రతిపాదించడాన్ని వ్యతిరేకించారు. ఆస్తుల మ్యుటేషన్ చేసుకున్న మాత్రాన వాటిపై హక్కులు రావని బిల్లులో పెట్టారని తప్పుబట్టారు. మరో ఆరు నెలల్లో మూడు కార్పొరేషన్ల ఎన్నికలకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ బిల్లుతో ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. హైదరాబాద్‌లో భూగర్భ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకి సంబంధించిన రూ.1,400 కోట్లు విలువైన కాంట్రాక్టును ఒకే కంపెనీకి ప్రభుత్వం ఇవ్వడాన్ని అక్బరుద్దీన్ ప్రశ్నించారు. బిల్లుపై బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే రాజాసింగ్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉత్తమ్ పద్మావతిరెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, నవీన్‌యాదవ్ సైతం మాట్లాడారు.

**కోర్టుల్లో నిలబడదు: పాల్వాయి హరీశ్**

'క్యూర్'చట్టం న్యాయస్థానం ముందు నిలబడదని, దానిని ఉపసంహరించుకోవాలని బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. ఈ బిల్లుకు తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకమన్నారు. ఈ చట్టం అమలులోకి వస్తే... మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు ఎలాంటి అధికారాలు ఉండవని, సీఎంకు అపరిమిత అధికారాలను కట్టబెడ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లుకు సంబంధించి 4,100 అభ్యంతరాలు వస్తే.. అందులో 3 వేలకు పైగా ఆస్తిపన్ను పెంపుదలపై ఆందోళన వ్యక్తమైందన్నారు.

**విశ్వనగరం ట్యాగ్ ఉండాలి: కూనంనేని సాంబశివరావు**

వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌కు విశ్వనగరం ట్యాగ్ ఉండాలని, అందుకోసం అధికార వికేంద్రీకరణతో మరింత అద్భుత నగరంగా తీర్చిదిద్దాలని సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు చెప్పారు. విశ్వనగరం ట్యాగ్ వస్తేనే.. పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తారన్నారు. విస్తీర్ణంలో మూడో స్థానంలో.. జనాభాలో ఏడో స్థానంలో మన రాజధాని ఉందన్నారు.

**మండలిలో క్యూర్ బిల్లు**

జిల్లాల విభజన అంతా అశాస్త్రీయమే: శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: పది జిల్లాలున్న తెలంగాణ రాష్ట్రాన్ని 33 జిల్లాలుగా ఎలా విభజించారో బీఆర్‌ఎస్ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. జిల్లాల విభజన పూర్తిగా అశాస్త్రీయంగా జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే క్యూర్ బిల్లును రూపొందించినట్లు వివరించారు. శాసనమండలిలో ఆయన క్యూర్ బిల్లును ప్రవేశపెట్టి మాట్లాడారు.

## అన్ని సౌకర్యాలు అందిస్తాం

-మొదటిపేజీ తరువాయి

సూచించారు. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలన్నారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని అన్నారు. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలి**

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని సూచించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామన్నారు. సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే నిర్వాహకులు ఆ వివరాలు స్థానిక కమిషనరేట్?కు అందించాలని సూచించారు. ఊహించని పరిణామాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

**మండపాల సమాచారం ముందుగానే ఇవ్వాలి**

ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మల కుంటలు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువుల వద్ద చుట్టూ క్రేన్స్ ఏర్పాటుకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ రివ్యూకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్?, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్ హాజరయ్యారు.

## ఎప్పటిలోగా తొలగిస్తారో చెప్పాలి

-మొదటిపేజీ తరువాయి

తొందరలో లిస్ట్ అప్‌లోడ్ చేయడం వల్ల తప్పు జరిగిందని పొంగులేటి ఒప్పుకున్నారన్నారు. తప్పు ఒప్పుకున్నప్పుడు బాధితులకు క్షమాపణ చెప్పి, సమస్యను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో ప్రకటించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 22ఏ జాబితాలో ఎన్ని ఎకరాలు చేర్చారు, ఎన్ని తొలగించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇల్లు జాబితా నుంచి తొలగించినట్టే ప్రజల భూములను కూడా జాబితా నుంచి తొలగించాలని హరీశ్‌రావు కోరారు.

**కాంగ్రెస్ సర్కారే భూమి, ఎన్‌వోసీ ఇచ్చింది..**

తన కుటుంబ సభ్యులపై పొంగులేటి చేసిన ఆరోపణలను హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. తన మామ హన్మంతరావు రిటైర్డ్ బ్యాంకు అధికారి అని, ఆయన కొండపాకలో భూమి కబ్జా చేశారన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఎక్స్ సర్వీస్‌మన్ సత్యనారాయణకు 1995లో అప్పటి ప్రభుత్వం ఆ భూమిని కేటాయించిందని, 2010లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌వోసీ ఇచ్చిందని వివరించారు. ఆ ఎన్‌వోసీ ఆధారంగా తన మామ చెక్ ద్వారా డబ్బు చెల్లించి, అప్పటి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. భూమి కేటాయించి ఎన్‌వోసీ ఇచ్చిందీ కాంగ్రెస్... రిజిస్ట్రేషన్ చేసింది కూడా నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే అని పేర్కొన్నారు. ఎకరం రూ.15 కోట్లు విలువ చేస్తుందని చెబుతూ, రూ.50 లక్షలకు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారంటూ పొంగులేటి చేసిన వ్యాఖ్యలు కూడా తప్పేనన్నారు. కొండపాక సిద్దిపేట నియోజకవర్గంలో కాకుండా గజ్వేల్ నియోజకవర్గంలో ఉందని, ఈ విషయంలోనూ మంత్రి తప్పుగా మాట్లాడారని పేర్కొన్నారు. నాదర్‌గుల్, ఖాజాగూడ భూములు, ఫీనిక్స్ కంపెనీ ఒప్పందం తదితర అంశాలపై తాను లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

**నిరూపిస్తే రాజీనామా చేస్తా: పల్లా**

జనగామ, వట్టినాగులపల్లి భూముల వ్యవహారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. వట్టినాగులపల్లిలో రూ.3 వేల కోట్ల విలువైన 29 ఎకరాల భూదాన్ భూమిని తాను తీసుకున్నానని పొంగులేటి ఆరోపించారని, ఇందులో వాస్తవం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందే తనకు ఎకరం పది గుంటల భూమికి అగ్రిమెంట్ జరిగిందని, రాష్ట్రం ఏర్పడిన తొలి నెలలోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని తెలిపారు. ఇది భూదాన్ భూమి కాదని 2008లోనే కోర్టు స్పష్టం చేసిందన్నారు. తనకు ఉన్నది ఎకరం పది గుంటలేనని, 33 ఎకరాల్లో మైనంపల్లి సోదరులు ప్లాట్లు కొనుగోలు చేశారని, అందులో 8.10 ఎకరాలు మైనంపల్లి చంద్రశేఖర్ పేరున ఉన్నాయని, వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తాను హరీశ్‌రావుతో కలిసి జనగామకు వెళ్లి ప్రభుత్వ అక్రమాలను బయటపెట్టినందుకే తనపై కక్ష పెంచుకున్నారని ఆరోపించారు. తన భూమిని 22ఏ జాబితాలో చేర్చి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, కోర్టు కూడా తన భూమి విషయంలో జోక్యం చేసుకోవద్దని చెప్పిందన్నారు. 29 ఎకరాల భూమి తనదని పొంగులేటి నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, నిరూపించలేకపోతే పొంగులేటి రాజీనామా చేస్తారా అని పల్లా సవాల్ విసిరారు.

## 12 గంటలు ఉత్త 'కోతలే'

**మహబూబ్‌నగర్:** ఎల్‌నినో, వర్షాభావంతో రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. వరుణుడు కరుణించకపోతాడా అనే ఆశతో వర్షాధారంగా సాగు చేసిన పంటలు ఇప్పటికే చేతికందకుండా పోయాయి. బోర్లు, బావుల కింద వేసినవి సైతం ఎండుముఖం పడుతుండటంతో రైతాంగం కన్నీరుమున్నీరవుతోంది. వ్యవసాయానికి త్రీఫేస్ కరెంట్ సరఫరాలో అప్రకటిత కోతలు అమలు చేస్తుండడమే ఇందుకు కారణం. నీళ్లున్నా, విద్యుత్ కోతలతో తడులందించలేని దుస్థితిలో పలు ప్రాంతాల్లో రైతులు రోడ్డెక్కుతున్నారు.

**దాదాపుగా 5 నుంచి 8 గంటలు మాత్రమే..**

రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో మొత్తంగా 1,19,55,375 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 50,92,817, పత్తి 48,21,503 ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయశాఖ నివేదికలు చెబుతున్నాయి. మొత్తం సాగులో వరి, పత్తి పంటల వాటా 82.9 శాతంగా ఉంది. అయితే వ్యవసాయానికి 12 గంటలపాటు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నా.. ఐదు నుంచి ఎనిమిది గంటలే ఇస్తున్నట్లు 'సాక్షి'బృందం పరిశీలనలో తేలింది. ఉదయం 5.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిరంతరాయంగా త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా.. దఫాల వారీగా అనధికారికంగా కోతలు అమలు చేస్తున్నారు. జిల్లాల వారీగా సరఫరా సమయాలతోపాటు కోతల సమయంలోనూ తేడాలు ఉన్నాయి.

**ఒక్కో జిల్లాలో ఒక్కోలా..**

-- జోగుళాంబ గద్వాల జిల్లాలో జిల్లాలో వ్యవసాయానికి కేవలం ఐదారు గంటలు మాత్రమే త్రీఫేస్ కరెంట్ ఇస్తున్నారని.. అది కూడా లో ఓల్టేజీతో సరఫరా చేస్తుండడంతో మోటార్లు కాలి పోతున్నాయి.

-- ఖమ్మం జిల్లాలో రోజుకు ఐదు నుంచి ఏడు గంటలే వ్యవసాయ విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రాంతాల వారీగా ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కోత పెడుతుండడంతో చివరి పంటకు నీరందడం లేదు. వేంసూర్ మండలంలో బోరుబావుల్లో నీళ్లున్నా.. తడులందకపోవడంతో పలువురు రైతులు ఎండిన వరిని తొలగించి.. జొన్న సాగు చేపట్టారు.

-- కామారెడ్డి జిల్లాలో రోజుకు ఆరు నుంచి ఏడు గంటలు మాత్రమే వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. కరెంట్ ట్రిప్ కావడం, లోఓల్టేజీ సమస్యతో మోటార్లు తరచు కాలిపోతున్నాయని.. ఒకసారి మరమ్మతుకు వస్తే అదనంగా రూ.10 వేల వరకు ఖర్చు వస్తోందన్నారు.

-- నిజామాబాద్ జిల్లాలో ఉదయం 8, 9 గంటలకు మొదలై సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ కరెంట్ ఇస్తున్నారు. మధ్యమధ్యలో రెండు గంటల పాటు కోత పెడుతున్నారు.

-- ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ కరెంట్ ఉదయం 7.30 గంటలకు ఇస్తున్నారు. మధ్యమధ్యలో కోతలతో మొత్తం 8 గంటలపాటే సరఫరా చేస్తున్నట్లు రైతులు తెలిపారు.

## శబరి మాత అఖండ జ్యోతి ముగింపు వేడుకల్లో బలరాం జాదవ్



సికె.న్యూస్.బోథ్:బోథ్ మండలం కనుగుట్ట గ్రామంలో నెల రోజులుగా భక్తిశ్రద్ధలతో కొనసాగిన శబరి మాత అఖండ జ్యోతి కార్యక్రమం ముగింపు వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరై శబరి మాతను దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఈ వేడుకల్లో రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పాల్గొని శబరి మాత ఆశీస్సులు తీసుకున్నారు. బోథ్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ప్రజలు.ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అధిక సంఖ్యలో భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కనుగుట్ట గ్రామం

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలం

- నిరుద్యోగ సమస్యపై మిలిటెంట్ పోరాటాలు
- ఏఐవైఎఫ్ రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యులు మేస్రం భాస్కర్,మాడవి గంగోత్రి అధ్యక్ష




సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాద్ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైయ్యాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యులు మేస్రం భాస్కర్, మాడవి గంగోత్రి, మండిపడ్డారు. ఈ నెల 8,9,10 తేదీలలో యాదగిరిగుట్ట లో జరిగిన ఏఐవైఎఫ్ 4వ రాష్ట్ర మహాసభ ఎన్నుకున్నరు నూతన రాష్ట్ర ఏఐవైఎఫ్ 71మంది నూతన కౌన్సిల్, 29మందితో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని జిల్లా కార్యదర్శి మేస్రం భాస్కర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నూతన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ప్రధానంగా నిరుద్యోగ సమస్యతోపాటు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం పరిరక్షణకై మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏఐవైఎఫ్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ ఆదిలాబాద్ జిల్లా సమితి సభ్యులు కూడిమేత సరోజ, ఆడే రిషి కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనతోనే పల్లెల అభివృద్ధి సాధ్యం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ఆకర్షణ పథకాలు వచ్చి కాంగ్రెస్ లో చేరుతున్నాం
- సర్పంచుల చేరికతో మరింత బలపడనున్న బజార్హత్నూర్ కాంగ్రెస్ పార్టీ
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎంపీ సోయం బాపురావు



సికె.న్యూస్. బజార్హత్నూర్:తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు చేరుతున్న సంక్షేమ పథకాలు, మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని బజార్హత్నూర్ మండలం గిరిజాయి, భూతాయి కే, ధర్మపురి సర్పంచులు తెలియజేశారుగిరిజాయి సర్పంచ్ పెందూర్ అరవింద్, భూతాయి కే సర్పంచ్ మడావి జైతు, ధర్మపురి సర్పంచ్ ఆర్క యాదవరావు, సీనియర్ నాయకులు కుమ్ర మారుతి మాజీ ఎంపీ సోయం బాపురావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు

ఈ సందర్భంగా మాజీ ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ గతంలో మరియు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే బజార్హత్నూర్ మండలంలోని గిరిజన గ్రామాలు అన్నింటికీ రోడ్డు సౌకర్యం, ఇందిరమ్మ ఇల్లు, పోడు భూములకు పట్టాలు అందాయని, 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో బజార్హత్నూర్ మండలానికి చేసిన అభివృద్ధి శూన్యమని ఆయన విమర్శించారుకొంతమంది నాయకులు బజారత్నూర్ మండలానికి ఎటువంటి అభివృద్ధి చేయకపోయినా సోషల్ మీడియాలో హడావుడి చేస్తున్నారని ఎవరి క్షేత్రస్థాయిపరిస్థితి ఏమిటో ఈ చేరికలే తెలుపుతున్నాయని తెలిపారు మూడు గ్రామపంచాయతీలో సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరడం వల్ల కాంగ్రెస్ పార్టీకి మరింత అదనపు బలం చేపడుతుందని రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో బజార్హత్నూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మాజీ బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, అందుర్ గ్రామ సర్పంచ్ పెందూర్ పృథ్వీరాజ్, మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తాం కామ్రేడ్ . విలాస్




సికె.న్యూస్. ప్రతినిధి.ఆదిలాబాద్ :ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసారి గ్రామంలో ఘనంగా 78వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలు

ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసారి గ్రామంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ చిల్కా దేవిదాస్ ఆధ్వర్యంలో 78వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ ఎస్. విలాస్, సీపీఐ ఆదిలాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ సిర్ర దేవేందర్, సీపీఐ ఆదిలాబాద్ పట్టణ కార్యదర్శి కామ్రేడ్ కట్ట చంద్రమౌళి హాజరయ్యారు.ఈ సందర్భంగా భీంసారి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, కామ్రేడ్స్ పండరినాథ్, రామయ్య, పార్ల విట్టల్, పూర్ణచందర్ స్మారక స్థూపాల వద్ద నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం కామ్రేడ్ ఎస్. విలాస్, కామ్రేడ్ చిల్కా దేవిదాస్, కామ్రేడ్ కట్ట చంద్రమౌళి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, పేద ప్రజల హక్కుల కోసం జరిగిన మహత్తర పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం అని అన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన వీరోచిత పోరాటంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని తెలిపారు.

1946లో ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటం వేలాది మంది రైతులు, కూలీలు, పేద ప్రజలను ఏకం చేసి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గొప్ప ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుందని అన్నారు. ఈ పోరాటంలో అనేక మంది కమ్యూనిస్టులు, రైతులు, కూలీలు, మహిళలు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని గుర్తుచేశారు. “దున్నేవాడికే భూమి” అనే నినాదంతో సాగిన పోరాటం ఫలితంగా లక్షలాది ఎకరాల భూమి పేద ప్రజల చేతుల్లోకి వచ్చిందని పేర్కొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటం దేశ చరిత్రలోనే ఒక గొప్ప రైతాంగ పోరాటంగా నిలిచిందని అన్నారు. ఆ పోరాట స్ఫూర్తితోనే నేటికీ సీపీఐ పేదలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు.

ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలను అమలు చేస్తున్నాయని వారు విమర్శించారు. ప్రజలపై భారాలు మోపుతూ, పేదల సమస్యలను గాలికి వదిలేసి సంపన్నుల ఆస్తులు పెంచేందుకు ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఆరోపించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు, గృహాలు, ఉపాధి, విద్య, వైద్యం, రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత వంటి మౌలిక సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన పోరాట కార్యక్రమాలు నిర్వహించడానికి వెనుకాడబోమని ప్రభుత్వాలను హెచ్చరించారు.తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నేటి తరం విద్యార్థులు, యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కామ్రేడ్ ఎస్. విలాస్ అన్నారు. ఆ పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు విద్యార్థులు, యువకులు, మహిళలు, కార్మికులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు సీపీఐని బలోపేతం చేసి ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కామ్రేడ్ గాజంగుల రాజు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు కామ్రేడ్ బత్తుల గంగారెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు కామ్రేడ్స్ బత్తుల రాజన్న, రామ్ రెడ్డి, సిసిలే దయానంద్, లక్ష్మి, యశోద, తుల్సి నర్సింగ్, చందా కిష్టయ్య, గంగారాం, గుండ్ల శ్రీను, ఖాళ్ళ నర్సింగ్, చంటి, మల్లేష్ తదితరులు, సీపీఐ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు దారుణం...




- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలి...
- కాంగ్రెస్ పార్టీ నాయకుల నిరసన ర్యాలీ ధర్నా

పెబ్బేరు సెప్టెంబర్12 (సి కే న్యూస్) అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును బర్తరఫ్ చేయాలని పెబ్బేరు పట్టణంలోని సుభాస్ చంద్రబోస్ చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాపర్ల రామిరెడ్డి,పట్టణ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో డప్పులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...దళిత నాయకుడైన స్పీకర్‌పై వ్యాఖ్యలుచేయడం దళిత సమాజాన్ని అవమానించడమేనన్నారు. మధును వెంటనే బర్తరఫ్ చేయాలని,స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలన్నారు.దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని కేసీఆర్ విస్మరించారన్నారు. దళిత నాయకుడు స్పీకర్‌గా ఉన్నాడనే కారణంతో కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదన్నారు.స్పీకర్‌ను అవమా నించడమంటే యావత్ తెలం గాణ ప్రజలను అవమానిం చినట్లేనన్నారు.దళిత స్పీకర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, మహిళా పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం విడ్డూరంగా ఉందన్నారు.బీఆర్ఎస్ నాయకులు దళితుల పట్ల చూపిస్తున్న వివక్షకు ప్రజలు రాబోయే కాలంలో తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, రేవంత్ సర్కారును ప్రజలు ఆదరిస్తారని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు,ఆయా గ్రామాల సర్పంచులు,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## బంగారు, వెండి ఆభరణాల చోరీ -- నిందితుడి అరెస్ట్

- రూ.85,600 విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- 100% రికవరీ
- క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ ఆధారాలతో కేసు చేదన
- దొంగ వస్తువులు కొనుగోలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు.
- గుడిహత్నూర్ ఎస్సై ఎల్. శ్రీకాంత్

సికె.న్యూస్. ప్రతినిధి.ఆదిలాబాద్ :గుడిహత్నూర్ మండల కేంద్రంలోని మహంకాళి గల్లీలో ఓ ఇంట్లో తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన కేసులో ప్రధాన నిందితుడిని గుడిహత్నూర్ పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ ఎల్ శ్రీకాంత్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 9న బాధితురాలు దుర్వ రాధ తన భర్తతో కలిసి కూలి పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన సమయంలో ఇంటి తాళం, లోపల ఉన్న స్టీల్ బాక్స్ తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. బాక్స్‌లో ఉన్న సుమారు రూ.85,600 విలువైన బంగారు, వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు మేరకు గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సంఘటనా స్థలాన్ని పరిశీలించి రెండు పగిలిన తాళాలను స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ బ్యూరో సహకారంతో స్టీల్ బాక్స్ తదితర వస్తువులపై ఉన్న వేలిముద్రలను సేకరించారు. సంఘటనా స్థలానికి సంబంధించిన దర్యాప్తు కొనసాగించారు. నిందితున్ని శుక్రవారం అరెస్ట్ చేయడం జరిగింది అని తెలిపారు. దొంగతనం చేసిన వస్తువులను కొనుగోలు చేసిన వ్యక్తిపై సైతం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**అరెస్ట్ చేసిన నిందితుడు:**

1) పెందూర్ మధుకర్ (21) ం/శీ కిషన్, డ్రైవర్, గిర్జై గ్రామం, బజార్‌హత్నూర్ మండలం, ప్రస్తుతం గుడిహత్నూర్.( దొంగ)

2) దహలే సంతోష్ (46) ం/శీ నారాయణ, గోల్డ్‌స్మిత్, లింగాపూర్ రోడ్, గుడిహత్నూర్, (దొంగ వస్తువులను కొనుగోలు చేసిన వ్యక్తి)

దర్యాప్తులో భాగంగా పోలీసులు సాంకేతిక ఆధారాలతో పాటు క్షేత్రస్థాయిలో పలు కోణాల్లో విచారణ చేపట్టారు. నిందితుడి కదలికలను గుర్తించి, చోరీ చేసిన ఆభరణాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసులో చోరీకి గురైన మొత్తం ఆభరణాలను 100 శాతం రికవరీ చేసి బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టారు. దొంగతనం చేసిన వస్తువులు అని తెలిసి కూడా వాటిని కొనుగోలు చేయడం లేదా విక్రయించేందుకు సహకరించడం చట్టపరంగా నేరమని, ఇలాంటి వ్యవహారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎల్. శ్రీకాంత్ హెచ్చరించారు. ప్రజలు తమ ఇళ్లకు నాణ్యమైన తాళాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు, ఎక్కువ సమయం ఇంటికి తాళం వేసి వెళ్లాల్సి వస్తే సమీప పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.




## డీజేలకు అనుమతులు ఇవ్వొద్దు

- శబ్ద కాలుష్యాన్ని నివారించాలి
- మధిర టౌన్ సీఐ కి డీవైఎఫ్ఐ వినతి



మధిర సెప్టెంబర్ 12(సికె న్యూస్)ప్రతినిధి.రాబోయే వినాయక చవితి సందర్భంగా డీజే కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వకుండా, అధిక శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు మధు కోరారు. ఈరోజు ఉదయం మధిర టౌన్ లోనే బోడెపూడి భవన్ లో జరిగిన టౌన్ డివైఎఫ్ఐ కమిటీ సమావేశం కి ముఖ్యఅతిథిగా హాజరైన బొడ్డు మధు యువతలో గంజాయి డ్రగ్స్ మద్యాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాబోయే వినాయక చవితి సందర్భంగా డీజే లకు అధిక సౌండ్ పొల్యూషన్ కు నివారణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు

ఈ మేరకు శనివారం మధిర టౌన్ సీఐ కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బొడ్డు మధు మాట్లాడుతూ.. డీజేలు, అధిక శబ్దాలతో నిర్వహించే కార్యక్రమాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా యువతపై డీజే సంస్కృతి ప్రతికూల ప్రభావం చూపుతోందని, కొందరు యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.మత్తు పదార్థాల ప్రభావంతో గొడవలు, రోడ్డు ప్రమాదాలు, ఇతర అవాంఛనీయ ఘటనలు జరిగే అవకాశం ఉందన్నారు. అధిక శబ్ద కాలుష్యం వల్ల మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు, వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారిపై అధిక శబ్దం మరింత ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు.

ప్రజల ఆరోగ్యం, శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని డీజే కార్యక్రమాలపై నియంత్రణ విధించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వకూడదని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐకి విజ్ఞప్తి చేశారు.

యువత భవిష్యత్తును కాపాడేందుకు మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడంతోపాటు, అధిక శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు పోలీసులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బొడ్డు మధు కోరారు.

ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వడ్రనపు మధు డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సైదులు టౌన్ నాయకులు గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు...

## 33 కేవీ ఫీడర్ మెయింటెనెన్స్ పనులు



**సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, సెప్టెంబర్ 12:**33 కేవీ పెద్దేముల్ ఫీడర్ మెయింటెనెన్స్ పనుల కారణంగా ఆదివారం సెప్టెంబర్ 13వ తేదీ నాడు పెద్దేముల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది.

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని తాండూరు ఏడీఈ శంకర్ నాయక్ తెలిపారు. 33 కేవి ఫీడర్ నిర్వహణ పనులను చేపట్టనున్న నేపథ్యంలో ఈ అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు

ఈ విషయాన్ని గమనించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని,మెయింటెనెన్స్ పనులకు సహకరించాలని ఆయన కోరారు. నిర్వహణ పనులు పూర్తయిన అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఏడీఈ శంకర్ నాయక్ తెలిపారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి: పోలీసులు.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు సెప్టెంబరు 12.**యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ శ్రీ అక్షాంశ్ యాదవ్ ఖ్రూ గారి ఆదేశాల మేరకు వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

రామన్నపేట సీఐ మొలుగూరి రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వలిగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని వివిధ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు. ఉత్సవాల సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గణేష్ మండపాల వద్ద శాంతిభద్రతలకు భంగం కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

ఉత్సవాల సమయంలో ప్రజల సహకారం పోలీసులకు అందించాలని కోరారు.

ప్రశాంతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని సీఐ రవి, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ిద

## అండర్--17 కబడ్డీ పోటీల్లో గాయత్రి స్కూల్ విజయం.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు సెప్టెంబర్ 12.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో నిర్వహించిన మండల స్థాయి క్రీడోత్సవాలు ఘనంగా ముగిశాయి.

అండర్--17 కబడ్డీ పోటీల్లో గాయత్రి స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

విజేతలైన విద్యార్థులను గాయత్రి స్కూల్ యాజమాన్యం ఘనంగా అభినందించింది.

ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక, మానసిక క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు.

క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల పెరుగుతాయని పేర్కొన్నారు. విజేతలు ముక్కామల విగ్నేష్, గూడూరు జస్వంత్ రెడ్డి, గరిసే మణిశంకర్, గర్దాస్ నితీష్‌లను అభినందించారు. అలాగే పొన్నాల తరుణ్ రెడ్డి, దోమల శివకుమార్, రాపోలు సాత్విక్, మార్క ప్రేమ్ కుమార్‌లకు అభినందనలు తెలిపారు.

ఎండి సోహెల్, కంకల అఖిల్ కుమార్‌లను కూడా పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పడమటి మురళీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిమిడి యాదిరెడ్డి, ప్రిన్సిపాల్ కొంతము బిక్షపతి పాల్గొన్నారు.

ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలకూర వెంకటేష్, బిమిడి కవిత, జక్క నవీన్ రెడ్డి తదితరులు పాల్గొని విజేతలకు అభినందనలు తెలిపారు.

# రైతన్న నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి



**సెప్టెంబర్ 12 (సీ కే న్యూస్) చేగుంట :**
రైతాంగ హక్కుల కోసం, అన్నదాతల సంక్షేమం కోసం తన జీవితాన్నే ధారపోసిన మహోన్నత కమ్యూనిస్టు నాయకుడు, ఆల్ ఇండియా కిసాన్ సభ ఉపాధ్యక్షులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మరణం మొత్తం వ్యవసాయ రంగానికి, రైతు ఉద్యమానికి తీరని లోటని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్ పేర్కొన్నారు.

స్థానిక చేగుంట పట్టణంలోని ఇన్స్పెక్టర్ బంగ్లా (ఐబీ) లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మద్ది లక్ష్మీ నరసయ్య అధ్యక్షతన సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. మల్లారెడ్డి పోరాట పటిమను, రైతు రక్షణ కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. సభలో శోభన్ మాట్లాడుతూ, ఈ రోజు మన మధ్య కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి భౌతికంగా లేరనే చేదు నిజం మన గుండెలను పిండివేస్తోంది. తెలంగాణ నేల కన్న వీరపుత్రుడు, వ్యవసాయ రంగాన్ని, రైతు సంక్షేమాన్ని తన శ్వాసగా మలుచుకున్న మహోన్నత నాయకుడు మల్లారెడ్డి గారు. వారి మరణం మన రైతు ఉద్యమానికి, కమ్యూనిస్టు పార్టీకి, మొత్తం వ్యవసాయ రంగానికి తీరని లోటు. ఏ రంగంలోనైనా ఉద్యమించడం వేరు, రైతాంగ హక్కుల కోసం త్యాగ నిరతితో తన జీవితాన్నే ధారపోయడం వేరు. సారంపల్లి మల్లారెడ్డి ఆ రెండో కోవకు చెందిన అరుదైన నాయకుడు. ఎండనక, వాననక అహోరాత్రులు రైతుల కష్టాలను తన కష్టాలుగా భావించారు. ఎక్కడ రైతుకు అన్యాయం జరిగినా, ఎక్కడ కౌలు రైతుకు హక్కులు కాలరాయబడినా, ఎక్కడ పంటకు మద్దతు ధర దక్కక అన్నదాత కన్నీరు పెట్టినా మొదటి గొంతుకగా నిలిచింది మన మల్లారెడ్డి ఆల్ ఇండియా కిసాన్ సభ నాయకుడిగా, తెలంగాణ రైతు సంఘం మార్గదర్శకుడిగా వారు చేసిన పోరాటాలు చరిత్ర పుటల్లో నిలిచిపోతాయి. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు కోసం, సాగునీటి ప్రాజెక్టుల సమగ్ర కేటాయింపుల కోసం, విపత్తుల్లో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం కోసం ఆయన ధర్నాలు, ముట్టడులు మాత్రమే కాదు. సుదీర్ఘమైన అధ్యయనంతో కూడిన పోరాటాలు చేశారు. ప్రభుత్వ బడ్జెట్‌లో వ్యవసాయానికి తగిన నిధులు దక్కాలని, కౌలు రైతులకు చట్టబద్ధమైన గుర్తింపు రావాలని ఆయన నిరంతరం తపించేవారు. నాయకత్వం అంటే కేవలం వేదికలపై మాట్లాడటం కాదు, క్షేత్రస్థాయిలో రైతుతో కలిసి నడవడమేనని ఆయన నిరూపించారు. సామాన్య కార్యకర్త నుంచి అఖిల భారత స్థాయి నాయకుడిగా ఎదిగినా ఆయన జీవితంలో ఎన్నడూ నిరాడంబరతను, అమాయకత్వంతో కూడిన ఆత్మీయతను వదల్లేదు. చిరునవ్వుతో పలకరిస్తూనే, రైతు విరోధి విధానాలపై సింహంలా గర్జించే తత్వం ఆయనది. కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి కి మనం ఇచ్చే నిజమైన సంస్మరణ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే. ఆయన కోరుకున్నట్లుగా రైతాంగాన్ని ఒకతాటిపైకి తెచ్చి, వారి హక్కుల కోసం, మెరుగైన వ్యవసాయ విధానాల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేయడమే మనం ఆయనకు అర్పించే ఘన నివాళి. ఆయన చూపిన ఉద్యమ బాటలో పయనిస్తామని, రైతాంగ ప్రయోజనాల కోసం తుది శ్వాస వరకు పోరాడుతామని ఈ సంస్మరణ సభ వేదికగా ప్రతిజ్ఞ చేశారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మద్ది లక్ష్మీ నరసయ్య, సిఐటియూ జిల్లా అధ్యక్షులు బాలమణి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేష్ మాట్లాడారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అయిత దివాకర్, మహమ్మద్ రఫీ, బోయిని నర్సింహులు, జిల్లా సహాయ కార్యదర్శులు సీహెచ్ లచ్చ గౌడ్, భాస్కర్, భిక్యా నాయక్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాలను సమిష్టి కృషితో విజయవంతం చేద్దాం -- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

- గణపతి మండపాలన్నీ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, జియో ట్యాగింగ్ చేయాలి
- ఉత్సవాలు పూర్తయ్యే వరకు పోలీస్ సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలి
- సైబర్ క్రైమ్ కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటించాలి
- గంజాయి, గుడుంబా, గ్యాంబ్లింగ్, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేత




**సికె.న్యూస్.ప్రతినిధి.ఆదిలాబాద్:**రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను సమిష్టి కృషితో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. శనివారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గణపతి మండపం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ అయ్యేలా చూడాలని, మండపాలను జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా గణపతి మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. గణపతి ప్రతిష్టాపన, నిమజ్జనం రోజున డీజేలు, టపాకాయలు, స్మోక్ బాంబులు, పేపర్ చల్లే యంత్రాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు అత్యవసర పరిస్థితులు మినహా సిబ్బందికి సెలవులు అడగకుండా, పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని తెలిపారు. రాత్రి వేళల్లో పటిష్టమైన పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఆర్థిక నేరాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలన్నారు. గంజాయి, గుడుంబా, గ్యాంబ్లింగ్, మట్కా తదితర కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నెలవారీ నేర సమీక్షలో జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించిన ఎస్పీ.. సైబర్ క్రైమ్ కేసుల దర్యాప్తును నాణ్యత ప్రమాణాలతో చేపట్టి, శాస్త్రీయ ఆధారాలతో నిందితులకు శిక్ష పడేలా పటిష్టమైన దర్యాప్తు చేయాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, ఈ-పెట్టీ కేసులపై చర్యలు చేపట్టి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. డయల్ 100/112 కాల్స్‌పై స్పందనను సమీక్షించారు. ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన, నీతి నిజాయితీతో విధులు నిర్వహించాలని, సస్పెక్ట్, రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. రహదారులపై సంచరించే పశువులను తొలగించేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా నెల రోజులుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి ఎస్పీ అభినందించారు.

ఈ సమావేశంలో అదనపు ఎస్పీ బి. సురేందర్ రావు (ఓఎస్డీ), ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, డీఎస్పీలు ఎల్. జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్, ఎం. వెంకట నర్సయ్య, స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, సైబర్ క్రైమ్, డీసీఆర్‌బీ అధికారులు, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ పై తాతా మధు అవమానకర వ్యాఖ్యలు సరికాదు.



**ఎల్ హెచ్ పి ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు.గోర్ బంజారా జాతీయ రత్న వార్డు గ్రహీత.దశరథ్ నాయక్**

**రాష్ట్ర కార్యదర్శి గుగులోతు కృష్ణ నాయక్**

**సికె న్యూస్ ప్రతినిధి** తల్లాడ మండలం రంగం బంజర్ గ్రామ నుండి నంగారభేరి లంబాడి హక్కుల పోరాట సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షులు మరియు గోర్ బంజారా జాతీయ రత్న వార్డు గ్రహీత ధర్మసోత్ దశరథ్ నాయక్. రాష్ట్ర కార్యదర్శి. గుగులోతు.కృష్ణా నాయక్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. దేశంలో కులవృక్ష తీవ్రస్థాయిలో పెరిగిందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు లోపలికి ఎళనివద్దని ఎవరూ చెప్పారు మీకు ఆ స్పీకర్ గాడు నా పాయింటు లాగామని చెప్పాడా స్పీకర్ గాడు అని తన అహంకార మాటలతో అవమానకర వ్యాఖ్యలు చేయటం సరికాదని అన్నారు అవసరమైతే తాతా మధు పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు అన్నారు. అదేవిధంగా ఎర్రవల్లి గ్రామ శివారులో దళితులు డబ్బు దప్పు కొట్టి ధర్నా చేసినందుకు మైలా పడిదని బిఆర్ సేనులు కెసిఆర్ ఫామ్ కు పసుపు నీళ్లు చల్లుతూ శుభ్రం చేయటం చాలా బాధాకరం అన్నారు స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అవుతున్న ఇంకా ఈ తెలంగాణలో కులవిక్షం పోట్లేదని వారు అన్నారు దళిత ఓట్లతో 10 సంవత్సరాలు గెలిచిన కేసీఆర్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు అంటే అంత నీకు కుట్ర ఎందుకు అని వారు హెచ్చరించారు.

## మానవత్వం చాటుకున్న చింతకాని సర్పంచ్ మనోహర్ బాబు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని గ్రామ నివాసి సూరబోయిన వెంకటేశ్వర్లు ఎవరు లేక ఒంటరి జీవితాన్ని గడిపేవాడు. అతనికి కనీసం ఇంటి వసతి కూడా లేక పాత ఎమ్మార్వో ఆఫీస్ లో తలదాచుకుంటూ తన జీవనాన్ని గడిపేవాడు. గత వారం రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ ఉదయం మరణించడంతో

ఇట్టి విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మనోహర్ బాబు చొరవ తీసుకొని కోలా నాగేశ్వరరావు మరియు బంధుమిత్రుల సహకారంతో ఈరోజు దహన సంస్కారాలు నిర్వహించి వారి మానవత్వాన్ని చాటుకున్నారు.

## లచ్చగూడెంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు కలెక్టర్ పరిశీలన

మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**లచ్చగూడెం, సెప్టెంబర్ 12: లచ్చగూడెం గ్రామంలో నూతనంగా మంజూరైన నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర్ గారు శనివారం పరిశీలించారు. నర్సింగ్ కళాశాల తరగతుల నిర్వహణ కోసం గ్రామంలోని మినీ స్టేడియంలో ఉన్న తరగతి గదులను ఆయన పరిశీలించారు.కళాశాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తరగతులు నిర్వహించే విధంగా అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.అనంతరం నర్సింగ్ కళాశాల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోగా కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ కొప్పుల గోవిందరావు, మండల ఆర్ఐ, సర్వేయర్, మాజీ సర్పంచ్ గొడుగు రమేష్, జీపీఓ, పంచాయతీ కార్యదర్శి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు మరియు ఎస్ఎస్సి స్కూల్ టాపర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి



**సీకే న్యూస్ ప్రతి నిధి గద్వాల్** ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని అనంత కన్వెన్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు మరియు ఎస్ఎస్సి స్కూల్ టాపర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న లిఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఎమ్మెల్యే గారిని శాలువా పూలగుచ్ఛం ఇచ్చి జ్ఞాపికతో సన్మానించిన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు మరియు ప్రిన్సిపాల్స్

ఎమ్మెల్యే మాట్లాడుతూ

ఈ రోజు మనం ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను, అలాగే గాజ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్కూల్ టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని.

ముందుగా మన ఉపాధ్యాయులందరికీ నా హృదయపూర్వక అభినందనలని.

ఒక విద్యార్థి విజయానికి తల్లిదండ్రులు ఎంత ముఖ్యమో, ఆ విజయానికి దిశానిర్దేశం చేసే ఉపాధ్యాయులు కూడా అంతే ముఖ్యమైనవారు.

ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించరు, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం మరియు సమాజం పట్ల బాధ్యతను పెంపొందిస్తారు.

ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక తరాన్ని మాత్రమే కాదు... ఎన్నో తరాల భవిష్యత్తును తీర్చిదిద్దగలడు.

ఈ సందర్భంగా గాజలో మంచి ఫలితాలు సాధించి స్కూల్ టాపర్లుగా నిలిచిన మన విద్యార్థులందరికీ ప్రత్యేక అభినందనలని.

మీరు సాధించిన ఈ విజయం మీ కష్టపడి చదివిన ఫలితం. అదే సమయంలో మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహానికి కూడా ఇది నిదర్శనమని.

ప్రియమైన విద్యార్థులారా...

ఈ విజయం మీ ప్రయాణానికి ముగింపు కాదు, ఒక గొప్ప భవిష్యత్తుకు ప్రారంభం. మీరు భవిష్యత్తులో ఏ రంగాన్ని ఎంచుకున్నా కష్టపడి, నిజాయితీగా, లక్ష్యంతో ముందుకు సాగాలి. మీ విజయంతో మీ కుటుంబానికి మాత్రమే కాకుండా మన గద్వాల ప్రాంతానికి కూడా మంచి పేరు తీసుకురావాలని

మన గద్వాల అభివృద్ధిలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు రెండూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

అందువల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మంచి వాతావరణం, అవసరమైన సౌకర్యాలు అందేలా మనమంతా కలిసి పనిచేయాలని.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడానికి నా వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుంది.

ఈ రోజు సన్మానం పొందుతున్న ప్రతి ఉపాధ్యాయుడికి, ప్రతి విద్యార్థికి మరోసారి నా హృదయపూర్వక అభినందనలు.

మీ కృషి ఇలాగే కొనసాగాలి. మన గద్వాల నియోజకవర్గం నుంచి మరింత మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచాలి.

మన విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని,

మన గద్వాల ప్రాంతం విద్యారంగంలో మరింత అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్పర్సన్ తుమ్మల విజయలక్ష్మి నర్సింహులు, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, మోసిన్, వంట భాస్కర్, మాకం బీచుపల్లి, బాబు నాయుడు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు

# పద్మశాలి పురస్కారం అందుకున్న కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్....



**సీకే న్యూస్ ప్రతినిధి గద్వాల్ గద్వాల, సెప్టెంబర్ 12:** హైదరాబాద్ నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ కు ప్రతిష్ఠాత్మక పద్మశాలి పురస్కారం లభించింది.పద్మశాలి ప్రజాప్రతినిధుల సేవలను గుర్తిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి అధ్యక్షులు కందగట్ల స్వామి,పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాసులు,గుండు సుధారాణి, ఎమ్మెల్సీ ఎల్.రమణ,తెలంగాణ ప్రాంతీయ పద్మశాలి అధ్యక్షులు కామర్తి మురళి తదితరుల చేతుల మీదుగా పులిపాటి వెంకటేష్ పురస్కారాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా పద్మశాలి సమాజ అభివృద్ధి, ప్రజా సేవలో తన వంతు కృషి కొనసాగిస్తానని పులిపాటి వెంకటేష్ తెలిపారు.ఆయనకు పలువురు పద్మశాలి సంఘం నాయకులు,ప్రజాప్రతినిధులు,అభిమానులు అభినందనలు తెలిపారు.

# ఎన్టీఆర్ ఆసుపత్రికి మహర్దశ.



- రూ.22.09 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ సెంటర్ ప్రారంభం.
- రూ.7.50 కోట్ల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలు.
- 220 నుంచి 400 కు పైగా పడకలకు విస్తరణకు ప్రతిపాదనలు.
- ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించడమే లక్ష్యం ఎంపీ, కొణతాల.

**అనకాపల్లి, సీకే న్యూస్** జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటు లోకి తీసుకురావడంలో భాగంగా అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో 50 పడకల క్రిటికల్ కేర్ సెంటర్ అందుబాటు లోకి వచ్చింది. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద రూ. 22.09 కోట్లతో నిర్మించిన ఈ క్రిటికల్ కేర్ సెంటర్‌ను కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ విజయవాడ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు.

అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఎంపీ డాక్టర్ సీఎం రమేష్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, కార్పొరేషన్ చైర్మన్లు, కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ క్రిటికల్ కేర్ సెంటర్ అందుబాటు లోకి రావడం అనకాపల్లి జిల్లా ప్రజారోగ్య రంగంలో ఒక కీలక ముందడుగు అని అన్నారు. ప్రమాదాలు, గుండె సంబంధిత అత్యవసర పరిస్థితులు, ఇతర క్లిష్టతర వ్యాధులతో బాధపడుతున్న వారికి సకాలంలో అత్యవసర వైద్యం అందించే అవకాశం ఏర్పడిందన్నారు. ప్రాణాలను కాపాడటంలో అత్యంత కీలక మైన గోల్డెన్ అవర్ లోనే చికిత్స అందించేందుకు ఈ కేంద్రం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను విశాఖపట్నానికి తరలించాల్సిన అవసరం తగ్గడంతోపాటు, పేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. అత్యవసర వైద్యం కోసం విశాఖపట్నం వెళ్లాల్సిన అవసరం లేకుండా అనకాపల్లి జిల్లా ప్రజలకు అవసరమైన అన్ని ప్రధాన వైద్య సేవలు స్థానికంగానే అందేలా జిల్లా ఆసుపత్రిని అభివృద్ధి చేయడమే మా లక్ష్యం అని వారు స్పష్టం చేశారు.

క్రిటికల్ కేర్ సెంటర్‌కు అదనంగా రూ. 7.50 కోట్ల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. వీటితో అత్యవసర వైద్య సేవలకు అవసర మైన మౌలిక వసతులు మరింత బలోపేతం అవుతాయని చెప్పారు. భవిష్యత్తులో 20 పడకల కిడ్నీ డయాలసిస్ సేవలను విస్తరించడంతో పాటు, ఆసుపత్రిలోని అన్ని విభాగాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. పరిశ్రమల సీఎస్సార్ నిధుల సహకారంతో జిల్లా ఆసుపత్రిలో ఆరు ఆపరేషన్ థియేటర్లు, పలు ఆధునిక వైద్య పరికరాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గైనకాలజీ విభాగంలో రూ. 36 లక్షల విలువైన టైఫా స్కాన్, కంటి వైద్య విభాగంలో రూ. 40 లక్షల విలువైన అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. డీ-అడిక్షన్ సెంటర్, వెయిటింగ్ హాల్ ఏర్పాట్లు పూర్తయ్యాయని, మూడు మృతదేహాలను భద్రపరిచే సామర్థ్యంతో మార్చురీని ఆధునికీకరించినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా ఆసుపత్రిలో 220 పడకల సామర్థ్యం ఉందని, భవిష్యత్తులో 400 కు పైగా పడకలకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎంపీ, ఎమ్మెల్యే తెలిపారు. దశలవారీగా ఆసుపత్రి భవనాలను ఆధునికీకరించి, రోగులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకర మైన వాతావరణంలో వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. భవిష్యత్తులో ఏంఆర్ఐ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు.

అనకాపల్లికి ఈఎస్ఐ వైద్య కళాశాల కోసం కృషి.

అనకాపల్లి పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జిల్లాకు ఈఎస్ఐ వైద్య కళాశాలను తీసుకురావడానికి కృషి చేస్తామని ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. పరిశ్రమలు, కార్మికులు, వారి కుటుంబాల అవసరాలకు అనుగుణంగా వైద్య మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జిల్లా ఆసుపత్రికి అవసరమైన నిధులు, వైద్య పరికరాలు సమకూర్చేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. అనకాపల్లి జిల్లా వేగంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు మెరుగైన వైద్య మౌలిక వసతులు కల్పించడం అత్యంత అవసరం. ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ జిల్లా ఆసుపత్రిని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, పరిశ్రమలు, సీఎస్సార్ సంస్థల సహకారంతో ముందుకు సాగుతాం అని వారు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల పై వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించవచ్చని అన్నారు. ప్రజలు వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అనకాపల్లిలోనే అన్ని ప్రధాన వైద్య సేవలు అందేలా చేయడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, డిప్యూటీ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, ఐఏఎస్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు, పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా బీజేపీ అధ్యక్షులు ద్వారపూడి పరమేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ, పరిశ్రమల ప్రతినిధులు, సీఎస్సార్ సంస్థలు, వైద్యులు, వైద్య సిబ్బందికి, ఎంపీ రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# గూడుపుమ్మ తల్లి ఆలయంలో అలరించిన కోలాటం

భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయం





**నక్కపల్లి సీకే న్యూస్ ప్రతి :** మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి ఆలయంలో భాద్రపద మాసం తొలిరోజైన శనివారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయంలో వున్న అమ్మవారిని ఇతర దేవతామూర్తులు, ఉపాలయాలను భక్తులు దర్శించుకున్నారు. నాతవరం మండలం తాండవ, మాధవనగరం, చమ్మచింత ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు ఆలయానికి వచ్చారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. చమ్మచింతకు చెందిన శ్రేయోభిలాషి సంస్థ అధ్యక్షుడు పి. నానాజీ ఆధ్వర్యంలో చిన్నారుల కోలాట ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. మహిళలు కూడా ఎంతో సందడిగా గడిపారు. వాళ్లందరికీ ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలందరికీ సౌభాగ్య ప్రసాదంగా పసుపు కొమ్ములు, గాజులు పంపిణీ చేశారు. అనంతరం తాండవ, చిమ్మచింతకు చెందిన భక్తులంతా ఆలయ ధర్మకర్త శ్రీహరిరాజును ఘనంగా సత్కరించారు.

# వెదుళ్లపాలెం వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి




**సీకే న్యూస్ ప్రతి** వెదుళ్ల పాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. నక్కపల్లి సిఐ జె.మురళి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం గ్రామ జంక్షన్ సమీపంలోని ఎన్ హెచ్ 16పై జరిగిన రోడ్డు ప్రమాదంలో నక్కపల్లి మండలం, చందనాడ శివారు గ్రామం తమ్మయ్యపేటకు చెందిన సూరకాసుల గురుమూర్తి, తండ్రి అప్పారావు, 46 సంవత్సరాలు, వెదుళ్లపాలెం లో అద్దెకు నివాసం ఉంటూ బోదిగల్లం ఆర్ అండ్ ఆర్ కాలనీ లో తన ఇంటి నిర్మాణ పనులు ముగించుకుని నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా, అనకాపల్లి నుండి తుని వైపు వెళు న్న ఏపీ 24 టిఏ 6924 నంబరు గల వాహనం డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపి గురుమూర్తిని వెనుక నుండి ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో గురుమూర్తికి తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ సంఘటనపై వారి అన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని సి ఐ మురళి తెలిపారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన కంబాల జోగులు





**నక్కపల్లి, సీకే న్యూస్** నక్కపల్లి మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణతో కలిసి శనివారం పలు కుటుంబాలను పరామర్శించారు. చందనాడ శివారు తమ్మయ్య పేట గ్రామానికి చెందిన సూరకాసుల గురుమూర్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చేతికి గాయంతో బాధపడుతున్న వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావును చినదొడ్డిగల్లులో తమ నివాసంలో కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాము కాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొత్తూరు గ్రామానికి చెందిన దొరబాబును ఆయన పరామర్శించారు. ఇటీవల అకాల మరణం చెందిన మత్స్యకార గ్రామం రాజయ్యపేటకు చెందిన పేర్ల నల్లారావ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ఓదార్చారు. చినదొడ్డిగల్లు, రమణయ్యపేటలో జరిగిన పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల కేంద్రంలో నక్కపల్లిలో బాల డాక్టర్ పలివెల శ్రీనివాసరావు తల్లి పెద్దకర్మ, కోన ప్రకాశరావు పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జోగులతో పాటు మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు, జడ్పీటిసి సభ్యురాలు గోసాల కాసులమ్మ, సాది రెడ్డి శ్రీను, తోట సత్తిబాబు తదితరులు ఉన్నారు.

## 'విశ్వంభర' 'కాకా'..

# ఏది సంక్రాంతి సినిమా?




మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'విశ్వంభర' విడుదలపై మరోసారి చర్చ మొదలైంది. ఎన్నో వాయిదాల తర్వాత సినిమాను వచ్చే సంక్రాంతి బరిలో దించేందుకు చిత్రబృందం ప్రయత్నిస్తున్నట్టు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. భారీస్థాయిలో తెరకెక్కుతున్న చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్ పనులు ఆలస్యం కావడంతో విడుదల పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. చిరంజీవి-వశిష్ఠ కాంబినేషన్‌లో తెరకెక్కిన సోషియో ఫాంటసీ చిత్రంపై మొదటి నుంచీ భారీ అంచనాలున్నాయి. చిరంజీవిని ఇంతకుముందెన్నడూ చూడని విధంగా చూపించేందుకు దర్శకుడు వశిష్ఠ ప్రయత్నిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది. ప్రస్తుతం కీలకమైన వీఎఫ్ఎక్స్ పనులు చివరి దశకు చేరుకున్నాయనే ప్రచారం నేపథ్యంలో సంక్రాంతి 2026 విడుదలపై మళ్లీ ఊహాగానాలు మొదలయ్యాయి. ఇదే సమయంలో సినిమా ఓటీటీ హక్కులపై కూడా చర్చలు తుది దశకు చేరుకున్నట్టు సమాచారం. అయితే భాగస్వామి, ఒప్పంద విలువపై అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. మరోవైపు ఇప్పటికే చిరంజీవి నటిస్తున్న 'కాకా'ను సంక్రాంతి విడుదలగా ప్రకటించారు. దీంతో 'విశ్వంభర' కూడా అదే రేసులోకి వస్తే రెండు మెగా సినిమాలను ఒకేసారి విడుదల చేయడం సాధ్యమవుతుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఒకవేళ 'విశ్వంభర'కు సంక్రాంతి రిలీజ్ ఖరారైతే.. 'కాకా' విడుదల తేదీలో మార్పు ఉండొచ్చనే ప్రచారం కూడా సాగుతోంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ వార్తలను కేవలం ఇండస్ట్రీ ప్రచారంగానే చూడాల్సి ఉంటుంది.

# ఫ్యాన్ లవ్‌కు.. రామ్ ఫిదా!




హీరో రామ్ పోతినేనికి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఓ అభిమాని ఆయనపై చూపిస్తున్న అభిమానం ఇప్పుడు అందరినీ కదిలిస్తోంది. తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన 18 ఏళ్ల యువతి.. రామ్ పాటలు, వీడియోలు చూస్తేనే ఆహారం తీసుకునే పరిస్థితిలో ఉంది. ఈ విషయం తెలుసుకున్న రామ్ చలించిపోయి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం దుప్పలపూడికి చెందిన సలాది శ్రీను, శ్రీదుర్గ దంపతుల కుమార్తె శశి భవ్యత అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతోంది. నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపడంతో తరచూ ఫిట్స్ రావడంతోపాటు శారీరక, మానసిక పరిస్థితి దెబ్బతింది. ప్రస్తుతం మంచానికే పరిమితమైన ఆమె.. చుట్టూ ఉన్నవారిని గుర్తించలేని స్థితిలో ఉన్నప్పటికీ, రామ్ పోతినేని పేరు మాత్రం ఆమెపై ప్రత్యేక ప్రభావం చూపుతుందని తల్లి చెబుతున్నారు. రామ్ ఫొటోలు, వీడియోలు చూపిస్తేనే ఆమె భోజనం చేస్తుండటం విశేషం. శశి భవ్యతకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రామ్ దృష్టికి వెళ్లింది. వెంటనే ఆయన కుటుంబంతో వీడియో కాల్‌లో మాట్లాడి యువతి ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్నారు. చికిత్స, మందుల ఖర్చుల విషయంలో కుటుంబం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అంతేకాదు.. అవసరమైన మందులు, పౌష్టికాహార సామగ్రిని పంపించడంతో పాటు, తన కళ్లద్దాలను కూడా ఆమెకు బహుమతిగా పంపారు. అభిమాని ప్రేమకు స్పందిస్తూ.. మాటలకే పరిమితం కాకుండా చేతల్లో సాయం చేయడం ద్వారా రామ్ తన మంచి మనసును చాటుకున్నారు.

## పాప్ స్టార్!



కయాదు లోహార్

## 'రోబో' రీ-ఎంట్రీ..

# థియేటర్లు దద్దరిల్లాల్సిందే!



భారతీయ సినిమా చరిత్రలో సాంకేతికంగా కొత్త అధ్యాయాన్ని రాసిన చిత్రం 'రోబో'. రజినీకాంత్-శంకర్ కాంబినేషన్‌లో 2010లో వచ్చిన సైన్స్‌ఫిక్షన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ అప్పట్లోనే ఇండియన్ సినిమాస్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లింది. రజినీ స్టార్‌డమ్, శంకర్ విజన్, అదిరిపోయే యాక్షన్, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్.. అన్నీ కలసి సినిమాను ఒక విజువల్ వండర్‌గా నిలబెట్టాయి. అయితే ఇప్పుడు 'రోబో' మరోసారి వార్తల్లోకి వచ్చింది. రీరిలీజ్‌ల ట్రెండ్ ఊపందుకున్న నేపథ్యంలో సినిమాను మళ్లీ థియేటర్లలో చూడాలంటూ రజినీ అభిమానులు సోషల్ మీడియాలో డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా సినిమాలోని యాక్షన్ సన్నివేశాలు, అప్పట్లోనే శంకర్ ఊహించిన ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీకి సంబంధించిన క్లిప్పులు తాజాగా వైరల్ అవుతుండటంతో ఈ డిమాండ్ మరింత పెరిగింది. అభిమానుల కోరిక మాత్రం సాధారణ రీరిలీజ్‌తో ఆగడం లేదు. 'రోబో'లాంటి విజువల్ వండర్‌ను అత్యుత్తమ ప్రీమియం ఫార్మాట్లలో, భారీ స్క్రీన్‌పై, అత్యాధునిక సౌండ్‌తో ఓ గ్రాండ్ ఈవెంట్‌లా తీసుకురావాలని కోరుతున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ డిమాండ్‌కు మంచి స్పందన వస్తోంది. మరి రజినీ-శంకర్‌ల 'రోబో' మరోసారి వెండితెరపైకి వస్తే.. థియేటర్లలో ఆ రోబో రచ్చ ఎలా ఉంటుందో ఊహించడం కష్టమే!




# సంక్రాంతికి తేజ్ మాస్ జాతర!

మెగా యంగ్ హీరో సాయి దుర్గ తేజ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. దర్శకుడు రోహిత్ కెపీ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం అభిమానులు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. గత ఏడాదిలోనే రావాల్సిన సినిమా పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. అయితే ఇప్పుడు ఫైనల్ వర్క్స్ మొదలవడంతో.. సంక్రాంతి బరిలో సినిమా రావడం పక్కా అనే సంకేతాలు వచ్చేశాయి. సాయి దుర్గ తేజ్ స్వయంగా డబ్బింగ్ పనులను ప్రారంభించిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. డబ్బింగ్ స్టూడియోలో పూజా కార్యక్రమాలకు సంబంధించిన వీడియోను షేర్ చేయడంతో అభిమానుల్లో జోష్ మొదలైంది. భారీ యాక్షన్‌తో తెరకెక్కుతున్న సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు ఉండగా.. తేజ్ కొత్త అవతార్‌లో కనిపించనున్నాడనే ప్రచారం మరింత ఆసక్తిని పెంచుతోంది. ఐశ్వర్య లక్ష్మి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. 'హనుమాన్' మేకర్స్ భారీ వ్యయంతో నిర్మిస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఎన్నో వాయిదాల తర్వాత ఇప్పుడు పనులు శరవేగంగా సాగుతుండటంతో.. ఈ సంక్రాంతికి సాయి దుర్గ తేజ్ ఎలాంటి 'సంబరాలు' చూపిస్తాడో చూడాలి!

## రేణుదేశాయ్ కొత్త ప్రాజెక్టు

# కాశీమజిలీ..

రవితేజ నటించిన 'టైగర్ నాగేశ్వరరావు'లో చివరిసారిగా తెరపై కనిపించారు రేణూదేశాయ్. దాదాపు మూడేళ్ల విరామం తరువాత మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రతి ఆదివారం ఈటీవీ విన్ 'కథాసుధ'ను అందిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా రూపొందిన 'కాశీ మజిలీ' చిత్రంలో ఆమె ప్రధాన పాత్రలో నటించారు. 'కొన్ని ప్రేమకథలకు మరో అవకాశం దక్కాలి' అనే థీమ్‌తో ఇది తెరకెక్కింది. యమున కిశోర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సెప్టెంబరు 13న ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో విడుదల చేసిన ట్రైలర్, అందులోని సంభాషణలు ఆకట్టుకుంటున్నాయి





# యాక్షనే కాదు ఎమోషన్ చూస్తారు

నేచురల్ స్టార్ నాని తొలిసారి ఓ క్రేజీ యాక్షన్ అవతారంలో కనిపించనున్న 'ది ప్యారడైజ్'పై అంచనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మించారు. తాజాగా మీడియాతో ముచ్చటించిన చిత్రబృందం సినిమాపై ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ముఖ్యంగా సెప్టెంబర్ 24న ఎలాంటి వాయిదా లేకుండా సినిమా విడుదలవుతుందని నాని స్పష్టం చేయడంతో అభిమానుల్లో జోష్ పెరిగింది. ట్రైలర్ లేకుండానే థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అడ్రినలిన్ రష్ ఇచ్చే సినిమా ఇదని నాని ధీమా వ్యక్తం చేశారు. అయితే 'ది ప్యారడైజ్' కేవలం రక్తసిక్తమైన యాక్షన్ ఎపిక్ కాదట. కథలో తల్లీ కొడుకుల మధ్య సాగే బలమైన భావోద్వేగ ప్రయాణం కీలకంగా ఉంటుందని నాని వెల్లడించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఆలోచనలు చాలా వైల్డ్‌గా, మ్యాడ్‌గా ఉంటాయని.. అలాంటి పిచ్చి ఉంటేనే ఇలాంటి భారీ ప్రపంచాన్ని సృష్టించగలరంటూ ప్రశంసించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇప్పటికే నార్త్ అమెరికాలో రికార్డు స్థాయిలో ప్రీ-సేల్స్ జరుగుతుండటంతో సినిమాపై ఉన్న క్రేజ్ ఏంటో అర్థమవుతోంది. మరి సెప్టెంబర్ 24న థియేటర్లలోకి రానున్న 'ది ప్యారడైజ'.. నాని కెరీర్‌లో మరో భారీ బెంచ్‌మార్క్‌ను సెట్ చేస్తుందా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.